

విజ్ఞానం, సమాచార వాహిని

సంచిక : 5 'వాసన్' నెట్‌వర్క్ త్రైమాసిక పత్రిక జనవరి - మార్చి 2008

# ప్రకృతి సేద్యమే నేటి వికృతులకు విరుగుడు

**- సుభాష్ పాలేకర్**

"ఊరి డబ్బు ఊరిలోనే ఉండాలి, పట్నాల డబ్బు ఊళ్ళకు చేరాలి. అందుకు అనుగుణంగా వ్యవసాయం ఉండాలి. ప్రకృతి - సేద్యం (Natural Farming) మాత్రమే దీనికి అనుగుణమైంది''. గత డిసెంబరులో 16-19 తేదీలలో నాలుగు రోజుల పాటు హైదరాబాదులో ప్రకృతి సేద్య విధానాలపై జరిగిన వర్క్‌షాపులో సుభాష్ పాలేకర్ మాటల్లో పలుమార్లు వినిపించిన ఈ భావన వర్క్‌షాపులో పాల్గొన్న 400 మంది రైతులు, రైతు కార్యకర్తలను అపూర్వ స్థాయిలో ఆకట్టుకుంది. ప్రకృతి సేద్యం పట్టాలపై వ్యవసాయంలో సుస్థిరత్వం సాధించగలమనే విషయంలో




సభికులెవరికీ సందేహాలు మిగల్లేదంటే అతిశయోక్తి కాదు.

ప్రకృతి సేద్యాన్ని పాలేకర్ జీరో -బడ్జెట్ (అసలే మాత్రం ఖర్చులేని) వ్యవసాయమని పేర్కొన్నారు. ఇందులో బయటి నుంచి ఏమీ కొనం. పోగా, ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. అంటే ఇది రైతులను రెండు విధాలుగానూ ఆదుకుంటుంది. రైతు ఆత్మహత్యల సమస్యకు ఇదొక్కటే నిజమైన సమాధానమని పాలేకర్ స్పష్టం చేశారు.

నిర్మిత/సృజన అనేది వ్యవసాయంలో మాత్రమే ఉంటుంది. ఒక్క పెసర గింజ (విత్తనం)తో వేల పెసర గింజలు వస్తాయి. యంత్రాలపై ఆధారపడే పరిశ్రమలో నిర్మితికి విరుద్ధంగా 'ఖండన' ఉంటుంది. యంత్రంలో 100 కిలోల పదార్థం వేస్తే 90 కిలోలే వస్తుంది. ఇందులో వస్తువులు మారడం మాత్రమే ఉంటుంది. 'ఖండన' ఉన్న చోట దోపిడి వుంటుంది. అందువల్ల వ్యవసాయం పరిశ్రమ వలే బయటి ఉత్పాదకాలపై ఆధారపడక్కర్లేదని పాలేకర్ సోదాహరణంగా వివరించారు.

హరిత విప్లవ కాలంలోని రసాయనిక సేద్యం వల్ల ఉత్పత్తులు (దిగుబడులు) తగ్గుతున్నాయే గాని పెరగడం లేదు. ఇది గత ఆరు దశాబ్దాల అనుభవం. వ్యవసాయోత్పత్తులు పెరగాలంటే నేలలో జీవద్రవ్యం (హ్యూమస్) పెరగాలి. సూక్ష్మజీవులు పెరగాలి. దానికి ప్రకృతి సేద్యమే మార్గం. రసాయనిక సేద్యం సూక్ష్మజీవులను (జీవద్రవ్యాన్ని) చంపేస్తుంది. అందువల్ల దిగుబడులూ తగ్గుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

వ్యవసాయం పూర్తిగా స్థానిక వనరులపై ఆధారపడాలనేది అసలు విషయం. సేంద్రియ సేద్యం (ఆర్గానిక్ ఫామింగ్)లో కూడా బయటి వనరుల ప్రమేయం ఉంటోంది. ఉదాహరణకి ఇందులో ముఖ్యంగా ప్రస్తావించే వర్మి కంపోస్టు కోసం ఎసినో ఫెటిడా అని విదేశాల నుంచి తెచ్చిన వానపాములను ఉపయోగిస్తారు. ఇది వరిగడ్డి వంటి జీవ పదార్ధాన్ని తింటుంది. ఇది విసర్జించే కంపోస్టులో మొక్కలకు ఉపయోగపడకుండా ఆవిరయిపోయే సేంద్రియ కర్బనమే 46 శాతం దాకా వుంటుంది. అది వెళ్ళిపోగా మిగిలే పదార్ధంలో కాడ్మియం, ఆర్సెనిక్, సీసం, పాదరసం, థోరియం వంటి భార లోహాలు (heavy metals) ఎక్కువగా వుంటాయి. ఇది మనుషులకు, నేలలోని సూక్ష్మజీవులకు ప్రమాదకరం.

నేలకు తగిన మేరకు సేంద్రియ పదార్ధాన్ని చేర్చి అక్కడే సూక్ష్మజీవులు, (దేశీ) వానపాముల వృద్ధి చెందేలా చూడడమే . . . అంటే, ప్రకృతి సేద్యమే సరైన విధానమని పాలేకర్ విశదం చేశారు.

విత్తనశుద్ధిలో 'బీజామృతం', మొక్కల పెరుగుదలకు 'జీవా మృతం', చీడ పీడల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రాలను ఉపయోగిస్తే చాలంటూ పాలేకర్ స్థానిక వనరులతో వాటిని తయారు చేసుకునే విధానాన్ని పూసగుచ్చినట్లు వివరించారు. ఒకే ఒక్క దేశి ఆవు పేడ, మూత్రాలతో... పై పద్ధతులతో ... 30 ఎకరాల చేనుకి పూర్తి సత్తువ అందించవ్చని, బండ్ల కొద్దీ పశువుల పేడ



వేయాలనే యావ కూడా అవసరమని పాలేకర్ చెప్పారు.

పంట మిగుళ్ళను కాల్చేయమని ఏ శాస్త్రజ్ఞులు చెప్పినా అది తప్పేనని, వాటిని నేలలో తేమని కాపాడటం కోసం మల్చింగ్‌గా (నేల - ఆచ్ఛాదనగా) వాడాలని చెప్పారు. నాలుగు రోజుల వర్కుషాపులో ప్రకృతి సేద్యం వెనుక సైద్ధాంతిక విశేషాల్ని అందరికీ అర్ధమయ్యే విధంగా వివరించడమే గాక, వరి, చెరకు వంటి పంటలు, మామిడి వంటి తోగలు, టమాటో వంటి కూరగాయలు ప్రకృతి సేద్య పథకంలో సాగు చేయడం ఎలాగో ఆయన వివరించారు.

-హెచ్చార్కె

## యూరియా ఉచ్చు . . .

రసాయనిక ఎరువులకు ప్రోత్సాహం, వాటిపై సబ్సిడీల కారణంగా రైతులు వీటికి అలవాటు పడిపో యారు. రసాయనిక ఎరువులపై సబ్సిడీకి ప్రతి సంవత్సరం 22,532 కోట్ల రూపాయలు ఖర్చు పెడుతోందంటే దేశంపై ఆర్ధిక భారం ఎంతో అర్ధమవు తుంది. యూరియా పై నేరుగా సబ్సిడీ ఉంది, నత్రజని, భాస్వరం, పొటాష్‌లు ఇచ్చే ఇతర ఎరు వులపై నోటిఫైడ్ సబ్సిడీ ఉంది.
దీనివల్ల అనేక విపరీత పరిణా మాలు ఎదురవుతున్నాయి. వీటిల్లో జింకు, ఇనుము, రాగి వంటి సూక్ష్మ పోషక పదార్ధాలనిచ్చే ఎరువులను రైతులు వాడకపోవటం మొదటిది. నత్రజని, భాస్వరం, పొటాష్‌లలో నత్రజనిని ఇచ్చే, అదీ యూరియాను ఎక్కువగా వాడటం రెండవది.
రసాయనిక ఎరువులను సమతూకంలో వాడకపోవటం వల్ల ఎదురయ్యే సమస్యలతో పాటు రసాయనిక ఎరువులను వాడటం వల్ల ఎదురయ్యే సమస్యలు అనేకం ఉన్నాయి. భూసారం దెబ్బతినటం, భూమి చవుడు బారడం వంటి సమస్యలు ఉదాహర ణల మాత్రమే. యూరియాలో అధిక శాతం నత్రజని మొక్కలకు అందక నీటిద్వారా భూగర్భజలాలోకి ఇంకి నీరు విషపూరితంగా మారు తోంది. అదేవిధంగా వాయు రూపంలో నష్టపోయే నత్రజని ఉష్ణోగ్రతలు పెరగటానికి కారణమవుతుంది.
ఉత్పత్తి (ప్రాడక్ట్) ఆధారిత సబ్సిడీ కాకుండా పోషక పదార్ధాల ఆధారిత సబ్సిడీకి మారాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. రసాయనిక ఎరువులకు సబ్సిడీ ఇచ్చినట్లు సేంద్రియ ఎరువులకు సబ్సిడీ ఇవ్వాలని భూసారంపై పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, శాస్త్రజ్ఞులు డిమాండ్ చేస్తున్నారు.

(డౌన్ టు ఎర్త్ సౌజన్యంతో)

# జీవనోపాధుల పథకం నుంచి నేర్చుకున్న పాఠాలు

***(ఆంధ్రప్రదేశ్ గ్రామీణ జీవనోపాధుల పథకం 1998లో సూత్రప్రాయంగా మొదలయ్యి 31 డిసెంబరు 2008 నాటికి ముగిసే వరకు దానితో వివిధ హోదాలలో ముడిపడి ఉన్న అతి కొద్దిమందిలో సుశ్రీ జానెట్ సీలి ఒకరు. ఆమె ఇదే పేరుతో రాసిన చిన్న నివేదికకు ఇది సంక్షిప్త అనువాదం.)***

ఈ పథకం ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా రూపొందిందే కాని దాని దాత సంస్థల వత్తిడి వల్ల కాదు. వాటర్‌షెడ్‌లలో పేదరికంపై దృష్టి కేంద్రీకరిస్తూ పని చెయ్యటానికి, ప్రభుత్వ వాటర్‌షెడ్లను బలోపేతం చెయ్యటానికి ఇది ఏర్పడింది. ఇది రూపొందడానికి ఒక సంవత్సర కాలం తీసుకున్నప్పటికీ 'డిజైన్'లో (ప్రత్యేకించి మానేజ్‌మెంట్ నిర్మాణంలో) కొన్ని లోపాలు ఉండి పథకాన్ని చివరి వరకూ ప్రభావితం చేశాయి.

పథకం అమలుకు జీవనోపాధుల దృక్పథంలో 2002లో ప్రక్రియల మార్గదర్శక సూత్రాలు వెలువడ్డాయి. మొదట్లో ప్రాజెక్టు సపోర్ట్ యూనిట్ (పిఎస్‌యు) ఉండటం వల్ల సృజనాత్మకతకు అవకాశం లభించింది. దీని అవసరం తీరిపోయిన తరువాత దాని స్థానంలో ప్రాజెక్టు మానేజ్‌మెంట్ యూనిట్ (పిఎంయు) ఏర్పడింది. వివిధ సందర్భాలలో కన్సల్‌టెంట్ల మద్దతు తీసుకోవడం కూడా పథకానికి ఎంతో తోడ్పడింది.

వనరులపై కాకుండా ప్రజలపై దృష్టి కేంద్రీకరించడం, భాగస్వామ్యాన్ని విస్తృత పరచడం కూడా మంచి అనుభవాలను ఇచ్చింది. అభివృద్ధికి కేంద్రంగా భూమి ఉన్న, భూమి లేని స్త్రీ, పురుషులను ఉంచి వ్యవసాయం, వ్యవసాయేతర జీవనోపాధుల కోసం పరిశోధించడంతో ఎన్నో అవకాశాలు ముందుకొచ్చాయి. మహిళల సాధికారీకరణ, అత్యంత పేదలకు మద్దతు ఇవ్వడంలో పథకం సఫలం అయ్యింది. జెండర్ దృక్పథాన్ని పథకంలో భాగం చెయ్యటంలోనూ మంచి ఫలితాలను సాధించాం. అయితే దీనికి సీనియర్ అధికారుల మద్దతు అవసరం. జెండర్ అంటే పురుషుడు కూడా అని, కార్యాలయాల్లో సైతం మన ప్రవర్తన, మాట్లాడే విధానం, రాసే విధానం మన దృక్పథాన్ని వెల్లడి చేస్తాయని గ్రహింపు రావాలి.

సామర్థ్యం పెంపుదలకు పథకం పెద్ద పీట వేసింది. జిల్లా సామర్థ్యం పెంపుదల కేంద్రాలతో మొదలయ్యి ఇది అన్ని జిల్లాల్లో క్లస్టర్, జిల్లా స్థాయి జీవనోపాధి వనరుల కేంద్రాలు ఏర్పడటానికి దోహదం చేసింది. అపార్డ్‌తో పాటు అనుభవమున్న స్వచ్ఛంద సంస్థలు ఒక కన్సార్షియంగా ఏర్పడి ఈ దిశలో సేవలు అందించాయి. శిక్షణల నాణ్యత పెరిగి, సాధించాల్సింది ఎంతో ఉన్నా సరైన దిశలోనే ఇది పురోగమిస్తోంది.

మానవ వనరుల అభివృద్ధి విషయంలో జిల్లా స్థాయిలోనే కాక రాష్ట్రస్థాయిలో కూడా దీని అవసరం ఉందని గుర్తించాం. కాంట్రాక్టు పద్ధతిలో తీసుకున్న వారి ప్రత్యేక అవసరాలను గుర్తించడంలోనూ, వారితో వ్యవహరించడంలోని మొదట్లో కొన్ని పొరపాట్లు జరిగాయి. మొదటిలో జరిగిన లోపాల వల్ల చాలా మంది నిపుణుల సేవలను పథకం కోల్పోయింది.

'కన్వర్జెన్స్' విషయంలో గ్రామస్థాయిలో కంటే రాష్ట్ర స్థాయిలో దీనిని సాధించడం ఎంతో కష్టమైనదని అవగాహన య్యింది. పశు సంవర్ధక శాఖతో, గ్రామీణాభివృద్ధిలోని ఇతర పథకాలతో కలిసి పని చెయ్యడం చక్కటి ఫలితాలను ఇచ్చింది. తగినంత సమయమిచ్చి, ఓపిక వహిస్తే కన్వర్జెన్స్ సాధ్యమవుతుందని విశదమయ్యింది. వాటర్‌షెడ్ అమలు సంస్థలుగా (హరియాలి వచ్చిన తరువాత ఫెసిలిటేటింగ్ సంస్థలుగా) చిన్న స్వచ్ఛంద సంస్థలతో పని చెయ్యటం మంచి అనుభవాలను ఇచ్చింది. ఇంకొకవైపు సామర్థ్యం పెంపుదల వంటి అంశాల్లో రాష్ట్రస్థాయి సంస్థలను భాగస్తులను చెయ్యటం పథకానికి లాభించింది.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ జీవనోపాధుల పథకానికి డిఫిడ్ నిధులు ఆగిపోతున్నాయి కాని, కార్యక్రమం ఆగిపోవటం లేదు. దీని విధానాలు, గుణపాఠాలు, అనుభవాలు అన్ని జిల్లాల్లో, అని వాటర్‌షెడ్లలో 'అప్ స్కేలింగ్' 2004లో మొదలయ్యి కొనసాగుతోంది. దీనికంతటికీ ముందునుంచే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ కార్యక్రమం ముందునుంచే వేరుగా కాకుండా ప్రభుత్వ వాటర్‌షెడ్లను బలోపేతం చెయ్యటానికి ఉద్దేశింపబడటం దీని ప్రత్యేకత. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ జీవనోపాధుల పథకంలో రూపొందించిన విధానాలు, తయారైన సిబ్బంది వాటర్‌షెడ్, అనుబంధ కార్యక్రమాల్లో కొనసాగుతూనే ఉంటారు. ❑

పత్రిక పరిచయం

## జీవనోపాధులు

దేశంలోనే తొలిసారిగా జీవనోపాధుల కోసం ప్రత్యేకించిన పత్రిక జీవనోపాధులు. ఇది ఒక నైపుణ్యానికో, ఒక వృత్తికో, ఒక వ్యాపారానికో, ఒక రంగానికో ప్రత్యేకించినది కాదు. ఇది జీవనోపాధులపై, ప్రత్యక్షంగా పేదల జీవనోపాధులపై దృష్టి కేంద్రీకరిస్తోంది. నూతన జీవనోపాధుల భావనలను పంచుకునే, చర్చించే ప్రాచుర్యం కల్పించే ఒక వేదిక ఇది.

ఈ పత్రికను పేదలు, వారి సంస్థలు, వారికి సహాయమందించే వ్యక్తులు, ఆ సంస్థల అవసరాలకు అనుగుణంగా రూపొందించాం. పేదల సంస్థల్లో, ప్రాజెక్టుల్లో వారికి సహాయం అందించే సంస్థల్లో, ప్రాజెక్టుల్లో వివిధ స్థాయిల్లో పనిచేసే జీవనోపాధుల కార్యకర్తలు, కమ్యూనిటీ కార్యకర్తలు, నాయకులు, పారావర్కర్లు, ఇతర కార్యకర్తల అవసరాలకు అనుగుణంగా ఈ పత్రిక ఉంటుంది. అంతేకాక జీవనోపాధుల రంగంలో కెరీర్‌ను మలచుకోవాలనుకునే వ్యక్తులకు, సిద్ధాంత కర్తలకు, అభివృద్ధి విద్యావేత్తలకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఏవో కొన్ని ప్రత్యేక రంగాలలో తప్ప జీవనోపాధుల కోసం ప్రత్యేకంగా ఒక పత్రిక ఇప్పటివరకు అందుబాటులో లేనందున, ఆ లోటు పూరించే దిశలో ఇది ఒక వినూత్నమైన ప్రయత్నం.

జీవనోపాధుల (పేదల) రంగాన్ని వేగంగా విస్తరిస్తున్న రంగంగా అక్షర నెట్‌వర్క్ ఫర్ డెవలప్‌మెంట్ సపోర్టు సర్వీసెస్ గుర్తించింది. అందుకే జీవనోపాధుల ప్రయత్నం ప్రారంభించింది. భారత రాజ్యాంగం (ఆర్టికల్ 19) ప్రజలకు జీవించే హక్కు అంటే సరైన జీవనోపాధిని పొందే హక్కు కల్పించిందని జీవనోపాధులకు తెలుసు. అంతేకాక కలిసి ఉండే హక్కుకు (రైట్ టు అసోసియేషన్) ఉన్న గుర్తింపు కూడా తెలుసు. ఈ అవగాహనతో పేదల జీవనోపాధుల రంగంలో సరైన, సరికొత్త జ్ఞానం అవసరాలను తీర్చడమే దీని లక్ష్యం.

ఇది ఒక ప్రయత్నం. జీవనోపాధుల భావనలను మా అవగాహన మేరకు చర్చించేందుకు, విస్తృతపరిచేందుకు ఇది ఒక వేదిక. మా కాలం, శక్తి, పట్టుదలతో ఈ పోరాటంలోని ప్రతి క్షణాన్ని అస్వాదిస్తున్నాం. మీరు కూడా ఎంతో ఉత్తేజితమవుతారని మా విశ్వాసం.

ఇందులోని విషయాలను విరివిగా వాడండి, అందరికి అందచేయండి. అయితే మూలం పేర్కొనండి, వివరాలు మాకు తెలియ చేయండి. మీ అనుభవాలను, పాఠాలను కేస్‌స్టడీలను మాకు అందచేయండి. మీ సమయం, శక్తి, విషయాలు, స్ఫూర్తి, సంఘీభావాలే మాకు ఊపిరి.

ఈ ప్రయత్నానికి మీ చందాలను పంపించగోరుతున్నాం. కనీసం రు. 1000 పంపితే 10 సంవత్సరాల పాటు పత్రికను ప్రతినెల పంపిస్తాం. వివరాలకు ఈ కింది చిరునామాను సంప్రదించగలరు.

జీవనోపాధులు, అక్షర నెట్‌వర్క్ ఫర్ డెవలప్‌మెంట్ సపోర్టు సర్వీసెస్, హెచ్ఐజి -11, బి-25, ఎఫ్ -6, ఎపిహెచ్‌బి కాలనీ, బాగ్‌లింగంపల్లి, హైదరాబాదు - 44. సెల్ నం. 99493 69720, ఈ -మెయిల్ akshara@aksharakriti.org

**- జీవనోపాధుల బృందం**

## ఫిబ్రవరిలో పర్మాకల్చర్‌పై రెండు వారాల శిక్షణ

రసాయనిక వ్యవసాయంలో ఉన్న సమస్యలకు ప్రత్యామ్నాయంగా అనేక ఆలోచనలు, ప్రత్యామ్నాయ విధానాలు ముందుకు వచ్చాయి. సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, బయో-డైనమిక్ ఫామింగ్, రిషీ ఖేతి, నెచుకో ఫామింగ్, జీరో బేస్డ్ వ్యవసాయం వంటివి ఇందుకు ఉదాహరణలు. ఒక్కొక్క దాంట్లో ఒక ప్రత్యేకత ఉంది. ఇటువంటి వాటిల్లో 'పర్మాకల్చర్' ఒకటి. పర్మనెంట్ అగ్రికల్చర్ (అంటే శాశ్వత వ్యవసాయమని అర్థం) అన్న రెండు పదాల కలయికతో ఈ పదం ఏర్పడింది. ఆస్ట్రేలియాలోని తాస్మానియాకి చెందిన బిల్ మాలిసన్ దీనికి రూపకల్పన చేశాడు. అనేక సాంప్రదాయ విజ్ఞానాలను, అనుభవాలను క్రోడీకరించి బిల్ మాలిసన్ దీనిని రూపొందించాడు.

పర్మాకల్చర్‌లో 'డిజైన్'కు ప్రాముఖ్యత ఎక్కువ. ఏ పని అయినా చేసే ముందు జాగ్రత్తగా ఆలోచించి ఏది,

(మిగతా 10వ పేజీలో)



# వాతావరణం వేడెక్కుతోంది . . . .

పుడమిపై జీవనానికి, సమస్త సంపదకు మూలం సూర్యుడు. భూమిపై ఉష్ణోగ్రతలు పగలు, రాత్రుళ్ళల్లో, వివిధ కాలాల్లో, వివిధ ప్రాంతాల్లో మారుతుంటాయి. అయితే మొత్తం మీద పారిశ్రామిక విప్లవం నాటితో పోలిస్తే ప్రస్తుత సగటు ఉష్ణోగ్రతలు 0.76$^{0}$ సెంటిగ్రేడు పెరిగాయి. అంతేగా అని తేలికగా తీసుకుంటే ముప్పును విస్మరించినట్లే.

**ఉష్ణోగ్రతలు ఎందుకు పెరుగుతున్నాయి?:** మానవ చర్యల వల్లనే ఇలా జరుగుతోంది. బొగ్గు, పెట్రోలు, డీజిల్ వంటి వాటి వాడకం, అడవులు, నరికి వేయటం వల్ల, వ్యవసాయం వల్ల కూడా బొగ్గు పులుసు వాయువు మీథేను, ఉష్ణోగ్రతలను పెంచటానికి కారణమైన ఇతర వాయువులు విడుదలవుతాయి. ఇవి వేడిమిని పట్టి ఉంచుతాయి కాబట్టి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. బొగ్గు పులుసు వాయువు సాంద్రత పారిశ్రామిక విప్లవం నాటికి పదిలక్షలలో 280 భాగం నుంచి ప్రస్తుతం 382కి పెరిగింది.

దీనివల్ల ఏం జరుగుతుంది?

మంచుకొండలు కరిగిపోతాయి. హిమాలయాలలోని మంచుకొండలు తగ్గుతున్నాయి. చరిత్రలో మొదటిసారి బ్రహ్మపుత్ర, గంగ నదులు వేసవిలో ఎండిపోనున్నాయి. సముద్రపు మట్టం పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల చిన్న చిన్న దీవులు మునిగిపోవచ్చు. సముద్ర తీరాలలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికావచ్చు. ఇక్కడి ప్రజలు ఉపాధులు కోల్పోతారు, నిర్వాసితులవుతారు. పంట భూములు పోతాయి. ఉష్ణోగ్రతలు పెరగటం వల్ల వాతావరణం అల్లకల్లోలమవుతుంది. తీవ్ర వర్షాలు (రెండు సంవత్సరాల క్రితం ముంబయిలో మాదిరి), తుఫానులు (అమెరికాను దెబ్బకొట్టిన 'కత్రినా'), కరువులు వంటివి ఏర్పడవచ్చు. అకాల భారీ వర్షాలు సంభవించవచ్చు. ఈ శతాబ్దం మధ్య కాలం నాటికి దిగుబడులు 30 శాతం తగ్గవచ్చు. ప్రజలలో రోగాలు, చావులు ఎక్కువవుతాయి. అంతేకాకుండా వేలాది జీవ జాతులు అంతరించిపోతాయి.

**మనం ఏం చెయ్యాలి?:** ఉష్ణోగ్రతలు పెరగటానికి కారణమయిన వాయువులు ప్రస్తుతం ఉన్న స్థాయిలోనే ఉన్నా వీటి ప్రభావం కొన్ని దశాబ్దాల పాటు ఉంటుంది. ఈ వాయువులను ఎక్కువగా వదిలేది అభివృద్ధి చెందిన దేశాలే కాబట్టి అవే ముందుగా చర్యలను చేపట్టాలని భారత ప్రభుత్వ అనటంలో వాస్తవముంది కానీ వీటి ప్రభావం వల్ల భారతదేశం పెద్ద ఎత్తున నష్టపోతుంది కాబట్టి మనం కూడా దీనికి నడుం కట్టాలి.



**ప్రజలుగా మనం చెయ్యవలసినవి:** ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయాలి, అన్ని రకాల సమానతకు కృషి చెయ్యాలి, అన్ని రకాల ప్రత్యేకించి సంపన్న వర్గాల వారి వినిమయాన్ని తగ్గించాలి. సంరక్షణపై శ్రద్ధ వహించేలా భారత ప్రభుత్వంపై వత్తిడి తేవాలి. బొగ్గుకి బదులు సౌరశక్తి, చౌకకార్లకి బదులు బస్సులు, మెట్రోలను ప్రోత్సహించాలి. పట్టణ ప్రాంతాలలో ధనికులమైన వాళ్ళం మన ఖర్చులను తగ్గించుకోవాలి. ఇది అంత తేలకయినది కాదు. అదీకాక నేను ఒక్కరినే మారితే ఫలితమేమి టనిపించవచ్చు. అయినప్పటికీ మార్పుకొద్ది మందితోనే మొదలవు తుందని గ్రహించి ముందుకు సాగాలి. దీర్ఘకాలం పరిష్కారాలు మరింత సమానతతోనే సాధ్యమవుతాయి కాబట్టి సుస్థిర, సమానతతో కూడిన అభివృద్ధికి కృషి చెయ్యాలి. (ఢిల్లీ ప్లాట్‌ఫారం వారి కరపత్రం ఆధారంగా, మరిన్ని వివరాలకు చూడండి: delhiplatform.blogspot.com)

కమ్యూనిటీ రిసోర్సు పర్సన్స్

# సామర్థ్య పెంపుదల లో సహాయక వ్యవస్థ

గత కొన్ని సంవత్సరాలుగా పేదరిక నిర్మూలన, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యం అనే దిశగా మారి ప్రజలు, ప్రజల ఆధారిత సంస్థల (సిబిఓలు) ద్వారా కార్యక్రమాల అమలు అనే నూతన ఒరవడి వచ్చింది. ఆయా కార్యక్రమాల్లో లబ్ధిదారుల భాగస్వామ్య స్థాయిని బట్టి ఆధారపడి వుంది. ఆ ప్రాథమిక లబ్ధిదారులు పూర్తిగా భాగస్వాములు కావాలంటే వారి అవగాహన, నైపుణ్య స్థాయిల్లో పెంపుదల చాలా ముఖ్యమైన అంశం. దీనికోసం రాష్ట్ర, జిల్లా,. మండల, గ్రామస్థాయి జిల్లాలో శిక్షణలను ఏర్పాటు చేసి ఎంతో పురోగతిని సాధించారు. వీరికి శిక్షణ ఇవ్వడానికి క్లస్టర్, జిల్లా స్థాయి జీవనోపాధి కేంద్రాలు, మండల వెలుగు శిక్షణా కేంద్రాలు ఏర్పడ్డాయి. శిక్షణా కార్యక్రమాల ఉధృతి పెరగడంతో ఒక ప్రత్యేకమైన రిసోర్సుపూల్‌ను తయారు చేసుకోవాల్సి వచ్చింది. ఎస్‌ఆర్‌పిలు, డిఆర్‌పిలు, ఎంఆర్‌పిలు, పిఆర్‌పిలుగా కార్యక్రమాల అమలులో వీరు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవి. ఇదే క్రమంలో కమ్యునిటీ నుండి రిసోర్స్‌పర్సన్‌లను (సిఆర్‌పిలను) ఉపయోగించి మంచి ఫలితాలను సాధించారు.

శిక్షణల కోసమే కాకుండా వాటర్‌షెడ్ సరిహద్దులను గుర్తించడం, వినియోగదారుల బృందాలు, కూలి బృందాలు ఏర్పరచడానికి వాసన్ సిఎల్‌ఆర్‌సి కమ్యూనిటీ రిసోర్సుపర్సన్లను తయారు చేసింది. దీనికి ప్రత్యక్ష అనుభవం ఉన్న కొంతమంది చురుకైన యువతీ యువకులను ఎంపిక చేసి నాలుగు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు.

ఈ అనుభవాలన్నింటినీ క్రోడీకరించి రంగారెడ్డి జిల్లా డిడబ్ల్యుఎంఎ (జిల్లా నీటి యాజమాన్య సంస్థ) జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ రిసోర్సు పర్సన్లు అనే వ్యవస్థను ఏర్పరచి బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ప్రాజెక్టు డైరెక్టర్లు డిఎల్‌ఆర్‌సిలో 20 ఆగస్టు 2007 తేదీ సిఆర్‌పిల ఎంపికను చేపట్టారు.

సిఆర్‌పిలుగా ఎంపిక కావడానికి కావలసిన అర్హతలు, నిబంధనలను రూపొందించారు. ఎంపిక చేసిన 12 మంది సిఆర్‌పిలకు వాసన్ సహకారంతో సిఎల్‌ఆర్‌సి, పరిగి నందు 3-7 అక్టోబరు 2007 తేదీలలో 5 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు.

**సిఆర్‌పిల విధులు, బాధ్యతలు:**

శిక్షణానంతరం వీరు ఎంపిక చేసిన గ్రామానికి విడతకు 15 రోజుల చొప్పున మూడు విడతలుగా మొత్తం 45 రోజులు వెళ్ళాల్సి ఉంటుంది. ఒక్కో గ్రామానికి నలుగురు సభ్యులు గల ఒక బృందం వెళుతుంది. ఆ బృందంలో సర్పంచ్ లేదా వార్డు మెంబరు ఒకరు, పారావర్కర్, బుక్ కీపరు లేదా యానిమేటరు ఒకరు, వినియోగదారుల బృందం లేదా కూలి బృందం నుండి ఒకరు, గ్రామ సంఘం, స్వయం సహాయక సంఘం మహిళ ఒకరు సభ్యులుగా ఉంటారు. వాటర్‌షెడ్ గ్రామంలో వీరు నిర్వర్తించవలసిన విధులు, బాధ్యతలను వివరించారు.

గోడ మీద రాతలు, కరపత్రాల ద్వారా కార్యక్రమం గురించి వివరిస్తూ ఎవరు ఏ సందేహాన్ని లేవనెత్తినా తమకు తెలిసిన మేరకు వీళ్ళు వివరించాలి. అవసరమైతే సిఎల్‌ఆర్‌సి కోర్సు డైరెక్టర్‌ను సంప్రదించి మరిన్ని వివరాలు తెలుసుకొని అందించాలి. వీరు 15 రోజులు ఎంపిక చేసిన గ్రామంలోనే బస చేయాలి, మధ్యలో ఒకరోజు విరామం తీసుకోవచ్చును.

* గ్రామ పంచాయితీ, గ్రామ సంఘం సూచించిన చోటనే బస చేయాలి. (సాధారణంగా గ్రామ పంచాయితీ కార్యాలయంలో బస చేయాలి.
* సిఆర్‌పిలకు కావలసిన పటాలు, సమాచారం, రోజు వారి సహకారాన్ని డబ్ల్యుడిటి అందిస్తారు. సిఆర్‌పిలు సిఎల్‌ఆర్‌సి కోర్సు డైరెక్టర్ పర్యవేక్షణలో పని చేస్తారు.
* సిఆర్‌పిలుగా పనిచేసినందుకు ఒక్క రోజుకు 150 రూపాయల ప్రకారం గౌరవ వేతనం చెల్లిస్తారు.
* సిఆర్‌పిల సొంత స్థలం నుండి ఎంపిక చేసిన గ్రామానికి రాను పోను బస్సు చార్జీలు చెల్లిస్తారు.
* ఎంపిక చేసిన గ్రామానికి మూడు విడతలుగా 45 రోజులు అదే వ్యక్తి వెళ్ళాల్సి వుంటుంది.
* గ్రామాలలో కేటాయించిన పని సంతృప్తిగా పూర్తి చేసిన తరువాత 15రోజుల వేతనం ఏ విడతకావిడత సిఎల్‌ఆర్‌సి కోర్సు డైరెక్టర్ ద్వారా చెల్లిస్తారు. ❑

# వర్షాధార పంటలలో పచ్చిరొట్ట సాగు

వర్షాధార వ్యవసాయం పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని మండల మహిళా సమాఖ్యలతో కలిసి వాసన్ పనిచేస్తోంది. ఇందులో భాగంగా ఆముదం, కంది పంటలలో ప్రయోగాత్మకంగా ఉలవ పంటను సాళ్ళ మధ్యలో పచ్చిరొట్ట పైరుగా సాగు చేసి చూశారు.

సాధారణంగా ఆముదం, కంది పంట సాళ్ళ మధ్య దూరం మూడు అడుగుల నుండి ఆరు అడుగులు ఉంటుంది. ఇక్కడ ఇవే ముఖ్యమైన పంటలు కావడంతో పంట మార్పిడి కూడా జరగడం లేదు. సేంద్రియ ఎరువులు అందుబాటులో లేకపోవడం వల్ల, ఈ వర్షాధార భూములలో భూసారం క్షీణ దశకు చేరుకుంది. ఇక్కడి నేలలు తేలికపాటివి అయినందున ఖరీఫ్‌లో ఒక పంట మాత్రమే తీసుకోగలరు. పంట కీలక దశలో వర్షాభావ పరిస్థితి ఎదురైతే ఆ సంవత్సర పంటపై పెట్టిన పెట్టుబడి, శ్రమ రైతులు పూర్తిగా నష్టపోతున్నారు.



ప్రతి సంవత్సరం నేలలో ఎకరాకు రెండు నుంచి మూడు టన్నుల సేంద్రియ పదార్ధం వేసినట్లయితే ఈ పరిస్థితి నుంచి రైతులు బయటపడగలరని వ్యవసాయ శాస్త్ర నిపుణులు, అనుభవజ్ఞులైన రైతులు భాగస్వామ్య చర్చలో నిర్ధారణకు వచ్చారు. ఇందులో భాగంగానే పంట సాళ్ళ మధ్య ఉలవ వేసి 30 నుంచి 45 రోజులకు కలియ దున్నినట్లయితే సుమారు ఎకరాకు ఒకటన్ను సేంద్రియ పదార్థం నేలలో కలుస్తుందని అంచనాకు వచ్చారు.

ఆ ప్రకారంగా ఆముదం, కంది పంట సాళ్ళ మధ్య ఉలవ పంట వేసి నేలలో కలిపారు. పరిశీలన రైతుల పొలంలో 50 చ.మీ. ఉలవ పంటను రెండు చోట్ల కోసి దాని బరువును తూకం వేసి చూశారు. ఈ విధంగా చేసినప్పుడు ఎకరాకు 5 క్వింటాళ్ళ నుండి 12 క్వింటాళ్ళ వరకు పచ్చిపొరక బరువు తూకం వచ్చింది. పాన్‌గల్, అడ్డాకుల్, పెద్దకొత్తపల్లి మండలాల్లోని 20 గ్రామాలలో ఎంపిక చేసిన రైతులు దాదాపు 56 ఎకరాలలో ఈ విధానం చేసి చూశారు. ఈ విధానం వల్ల ఎకరాకు ఏడు, ఎనిమిది కిలోల విత్తనాలకు మాత్రమే ఖర్చు అవుతుంది. పంట యాజమాన్యంలో భాగంగా ప్రతి రైతు నాలుగు నుండి ఐదుసార్లు కలుపు తీసి వేయటానికి రొప్పుతారు. పచ్చిరొట్ట విధానం పాటించడం వల్ల ఒకసారి రొప్పడం ఖర్చు తగ్గుతుంది. అదేవిధంగా కలుపు కూడా తగ్గుతుందని రైతులు అనుభవపూర్వకంగా తెలియ చేస్తున్నారు. పెద్ద కొత్తపల్లి మండలం నక్కలపల్లి గ్రామంలో నర్సప్ప అనే రైతు ఈ పద్ధతిలో సాగు చేసిన ఒక ఎకరం ఆముదంలో రెండవ గెళలో ఆడపూత దాదాపు 50 శాతం అధికంగా ఉన్నట్టు మిగతా రైతులు కూడా గమనించారు. ❑

## సుస్థిర వ్యవసాయ రైతు వేదిక

సుస్థిర వ్యవసాయంలో నమ్మకం ఉండి, ఆ వ్యవసాయ పద్ధతులను ఆచరిస్తున్న కొంతమంది రైతులు మార్చి 23-24, 2006 తేదీలలో సమావేశమై సుస్థిర వ్యవసాయ రైతు వేదిక ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. దీంట్లో భాగంగా చాలా గ్రామాల్లో గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు. సుస్థిర వ్యవసాయంపై పనిచేస్తున్న ఊర్లలో చర్చల ద్వారా ఇటువంటి కమిటీలను ఎన్నుకు న్నారు. ప్రతి కమిటీలో ఇద్దరు స్త్రీలు, ఇద్దరు పురుషులు ఎన్నిక అయ్యారు. సేవా భావంతో, రైతుల కోసం పనిచేయడానికి సిద్ధంగా వున్న వారిని గ్రామస్థాయి కమిటీలో పెట్టుకున్నారు.

రాష్ట్రస్థాయి వేదిక ఏర్పాటు చేసుకుని ఈ స్థాయిలో నేతలను ఎన్నుకోటానికి రాష్ట్రస్థాయి సుస్థిర వ్యవసాయ రైతు వేదిక సదస్సు ఫిబ్రవరి 7, 8 తేదీలలో హైదరాబాదులో జరగను న్నది. ఈ రెండురోజుల ఏజెండా: రాష్ట్రస్థాయి కమిటీ ఎన్నిక, ఒక ఏడాది వరకు కార్యాచరణ ప్రణాళిక, మరింతమంది రైతులను ఈ వేదికలో భాగం చేయటం, మార్గదర్శక సూత్రాల నిర్ణయం. (వివరాలకు సంప్రదించండి : కవిత కురుగంటి, 9393001550)

# 'బుద్ధి' వ్యవసాయం

ఇప్పుడు ప్రపంచమంతా వినవస్తున్న మాట సేంద్రీయ వ్యవసాయమే దిక్కు అని. మనం ఒకింత జాగ్రత్తగా భారతీయ వ్యవసాయాన్ని, రైతు ఆలోచనా విధానాన్ని పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా గోచరిస్తుంది. వినియోగదారులంతా ప్రకృతి సిద్ధంగా, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల అనుసరించి పండించిన ఆహారాన్ని మాత్రమే కోరుకుంటుంటే, మరోవైపు రైతులు ఈ గొప్ప అవకాశాన్ని సాకారం చేయలేకపోతున్నారు. కొంతమంది రైతులు హరిత విప్లవ భావజాలానికి బానిసలై తన నేలల్ని, తమ ఆరోగ్యాల్ని మరింతగా పాడుచేసుకుంటుంటే, మరికొంతమంది మంది రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్ళుదామనుకున్నా తమను ఆ బాటలో చేయి పట్టుకుని నడిపే బుద్ధి రైతులు కరువై కొట్టుమిట్టాడుతున్నారు.

ఈ నేపథ్యంలో సుక్షేత్రం సంస్థ సేంద్రియ వ్యవసాయంలో ఆసక్తి ఉన్న రైతులను ఎంపిక చేసి వారికి డిసెంబరు 21-24 తేదీలలో నాలుగు రోజుల పాటు శిక్షణ ఇచ్చింది. సుక్షేత్రం సంస్థ ముఖ్యోద్దేశం ఒక సలక్షణమైన శిక్షణా విధానాన్ని అమలులోకి తెచ్చి, మూడంచెలుగా ప్రతి గ్రామంలో కనీసం ఒక సుశిక్షితులైన బుద్ధి రైతును ఆ గ్రామ రైతులకు అందుబాటులోకి తేవడం.

ఈ పద్ధతిలో మొదటి అంచెలో ప్రతి జిల్లా నుండి ఒకరిద్దర్ని ఎంపిక చేసి వారికి సేంద్రియ వ్యవసాయంలో మేధోపరమైన అచరణీయమైన విషయాలలో పూర్తి శిక్షణ ఇచ్చాం. ప్రతి రైతు వ్యవసాయంలోని వివిధ అంశాల మీద దుక్కి నుంచి పంట కోత దాకా, తమ చేతులతో చేస్తూ ఆ పద్ధతుల వెనక ఉన్న మూల సూత్రాలను అర్థం చేసుకుంటూ పంటలోని అన్ని దశలలో



శాస్త్రం, తమ బుద్ధి, ఆచరణలను అనుసంధానం చేసి ఉత్తమమైన ఫలితాలను సాధించవలసి ఉంటుంది.

ఈ రైతులు తమ ప్రాంతాలకు వెళ్ళి ఈ నవీన సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను తమ పొలాల్లో అమలు చేసి, పూర్తి పట్టు సాధించి తోటి రైతులకు ఈ శిక్షణా విధానాన్ని అమలు చేసి మరింతమంది బుద్ధి రైతులను తయారు చేయవలసి ఉంటుంది. సుక్షేత్రం కార్యాలయం ఉన్న చిన్నమండవ గ్రామం (చింతకాణి మండలం, ఖమ్మం జిల్లా)లో శిక్షణ జరిగింది. శిక్షణా కార్యక్రమాన్ని రెండు భాగాలుగా చేసి ఉదయం, సాయంత్రం పొలంలో తమ చేతుల మీదుగా చేసే పనులకు, మధ్యాహ్నం మేధోపరమైన విషయాలకు, చర్చకు కేటాయించాం. దుక్కి విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వాడవలసిన పనిముట్లు, యంత్రాలు, వాడకూడని పనిముట్లు, తప్పుడు పద్ధతుల్లో, తప్పుడు పనిముట్లు వాడటం వల్ల జరిగే నష్టాలను చూపాం. ఆ తరువాత పెంటకుప్ప విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సరైన పద్ధతిలో పూర్తిగా కుళ్ళబెట్టె విధానం, కుళ్ళని పెంటపోగు వల్లజరిగే నష్టాలను, ఇబ్బందులను సోదాహరణంగా వివరించాం. మంచి సజీవమైన నేల ఎట్లా తయారవుతుందో దానికి మనవంతు బాధ్యత, ఆచరణీయమైన వివిధ రకాలైన పద్దతులు వివరించి మధ్యాహ్నం నేలలో నిరంతరం జరిగే ప్రక్రియలని వివిధ రకాలైన సూక్ష్మజీవుల మధ్య రసాయన పదార్థాలు సేంద్రియ పదార్థాలు ఉన్నప్పుడు, లేనప్పుడు జరిగే పరిణామాలను సినిమా ద్వారా, సైడ్ల ద్వారా చూపించి ఆ తరువాత ప్రకృతిలో వివిధ జీవుల పాత్రలను చర్చిస్తూ తెలుసుకున్నారు.

ఈ మొదటి శిక్షణా కార్యక్రమంలో వరిని ప్రధానమైన పంటగా గుర్తించి వరిసాగులోని అన్ని అంశాలను, వివిధ సాగు పద్ధతులను, కొత్త పద్ధతుల్లోని మెలకువలను, వరి పంటలోని ముఖ్యమైన దశలను చూపించి, సేంద్రియ వ్యవసాయ స్ఫూర్తి అనుగుణంగా 'శ్రీ' సాగును ఎలా అమలు చేయాలో పొలంలో శిక్షణ ఇచ్చాం. దుక్కి దున్నడం, నాణ్యమైన పెంటపోగు వాడటం, తక్కువ ఖర్చుతో, తక్కువ శ్రమతో పొలం తయారు చేయడం, విత్తనాన్ని పరీక్షించి మంచి విత్తనాన్ని వేరు చేయడం, నారుమడిని తయారు చేయడం, అందులోని మెలకువలు, సులువైన పద్ధతిలో గీతలు గీయడం, ఈ మధ్యనే కొత్తగా రూపొందించిన పద్ధతిలో

నారు మట్టి వేరు చేసి, శుద్ధి చేసి పొలానికి చేరవేసి నాటు వేయడం, ఆ తరువాత రకరకాల వీడర్లతో కలుపును తొక్కే విధానం, నీటి తడి విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఇవన్నీ పక్కన ఉండి రైతులతో చేయించాం. రైతులకు సహజంగా వచ్చే అనుమానాలను, ఉండే అపోహలను నివృత్తి చేసి, తాము తమ పొలాల్లో ఇవన్నీ చేయగలం అనే నమ్మకం వచ్చే దాకా ఈ పనులన్నీ వారితోనే చేయించాం.

ఈ కార్యక్రమానికి మొత్తం 11 మంది రైతులు హాజరయ్యారు. కృష్ణా, ఖమ్మం, శ్రీకాకుళం, విశాఖపట్నం, చిత్తూరు జిల్లాల నుంచి ఎంతో శ్రమకోర్చి, సొంత ఖర్చులతో వచ్చి శిక్షణ జరిగిన నాలుగు రోజులూ ఎంతో ఉత్సాహంగా అన్నదమ్ముల్లాగా కలిసి మెలిసి ఉంటూ ఒక మంచి వాతావరణం ఏర్పడటానికి సహకరించారు. శిక్షణా కార్యక్రమం చివర్లో వారు వెలిబుచ్చిన అభిప్రాయాలు, ప్రశంసలూ, సూచనలూ, నిర్వాహకులకు ఎంతో స్ఫూర్తినీ, ఆనందాన్నీ, తృప్తినీ ఇచ్చాయి. శిక్షణ పొందిన ప్రతి రైతూ తను ఈ విధమైన శిక్షణకు తోటి రైతులకు ఇవ్వగలనని పూర్తి విశ్వాసాన్ని వ్యక్తపరిచారు.

ఈ శిక్షణా విధానాన్ని మరిన్ని అవసరమైన మార్పులు చేసి ఫిబ్రవరి ఆఖరు వారంలో నిర్వహించడానికి సుక్షేత్రం ఏర్పాట్లు



చేస్తుంది. ఫిబ్రవరిలో జరగబోయే రెండవ విడత శిక్షణకు మిగతా జిల్లాల నుంచి ఉత్సాహవంతులైన, సేంద్రీయ వ్యవసాయంలో ఆసక్తి కలిగిన రైతులు హాజరై, శిక్షణ పొంది బుద్ధి వ్యవసాయాన్ని అన్ని దిక్కులకూ విస్తరిస్తారని ఆశిస్తున్నాం.

**పర్సా కిషన్‌రావు, సుక్షేత్రం, చిన్న మండవ గ్రామం, చింతకాణి మండలం, ఖమ్మం జిల్లా 507 208, ఫోను నం. 9441123197**

❑

# ప్రభుత్వ - స్వచ్ఛంద సంస్థల మధ్య సహకారం

ప్రభుత్వ - స్వచ్ఛంద సంస్థల సమన్వయ సంఘానికి శ్రీ టి. గోపాలరావు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా మే నెలలో నియమితులయ్యారు. ఈ సంఘంలోని స్వచ్ఛంద సంస్థల సభ్యత్వం రెండేళ్ళ వరకు ఉంటుంది. మొదటి కమిటీలోని సంస్థల సభ్యత్వ కాలం ముగియటంతో మే 2007లో కొత్తగా కమిటీకి స్వచ్ఛంద సంస్థలను ప్రతిపాదించారు (పంచాయితీరాజ్ & గ్రామీణాభివృద్ధి (ఆర్‌డి IV) శాఖ, జివో ఆర్‌టినెం.766, తేదీ 28-5-2007). వీళ్ళు 1) కోవా, హైదరాబాదు, 2) ఎపిమాస్ హైదరాబాదు, 3) రాస్, తిరుపతి, 4) ఆర్‌డిటి, అనంతపురం, 5) ఎఎంజి ఇంటర్నేషనల్ చిలకలూరిపేట, 6) బిసిటి, యలమంచిలి, 7) సిహెచ్‌ఆర్‌ఐ, హైదరాబాదు, 8) గ్రామాభ్యుదయ మండలి, నిజామాబాద్, 9) లెప్రా సొసైటీ, సికింద్రాబాదు.

స్వచ్ఛంద రంగంపై జాతీయ విధానం ఖరారు అయ్యింది - (ముసాయిదా ప్రతిపై ఒక వ్యాసాన్ని చెలమి రెండవ సంచికలో ప్రచురించాం). దీనిని ఇంగ్లీషు పూర్తి పాఠం కోసం చూడండి www.wassan.org. ఇదే తరహాలో రాష్ట్రానికి స్వచ్ఛంద రంగంపై విధానాన్ని రూపొందించాలన్న ఆలోచనతో సమన్వయ సంఘం ఉంది. ముందుగా ముసాయిదా పత్రం తయారు చేసి, స్వచ్ఛంద సంస్థలతో చర్చించి తుది ప్రతిని ప్రభుత్వానికి ఆమోద నిమిత్తం సమర్పిస్తుంది.

ప్రభుత్వ-స్వచ్ఛంద సంస్థల సమన్వయ సంఘం ఏర్పడిన తరువాత ఎపి మాస్ చొరవతో జిల్లా స్థాయి సమావేశాలు జరిగాయి. వీటి ఆధారంగా ఎపి మాస్ ఒక నివేదిక కూడా ముద్రించింది. స్వచ్ఛంద సంస్థల కోసం ఒక వెబ్‌సైట్ ఉండాలని, సమన్వయ సంఘానికి మద్దతుగా పూర్తికాల సిబ్బందితో ఒక సెక్రటేరియట్ ఉండాలని భావిస్తున్నారు. మరిన్ని వివరాలకు సంప్రదించండి: సిఎస్ రెడ్డి, ఎపిమాస్ - 040 23547927/ 52, వెబ్ సైట్: creddy@apmas.org

❑

# కార్పోరేట్ నేరాలపై పోరాట ఝరి – 'చింగారి'

బోపాల్ గ్యాస్ దుర్ఘటన జరిగి 23 సంవత్సరాలయ్యింది. కార్పోరేట్ సంస్థల నిర్లక్ష్యానికి వేలాది మంది బలయ్యారు, ఈనాటికీ ఎంతోమంది అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ దుర్ఘటనకు వ్యతిరేకంగా ఎంతోమంది పోరాడారు. న్యాయం కోసం బాధితుల తరపున భారత ప్రభుత్వం, యూనియన్ కార్బైడ్, దాని వారసురాలు డౌ కెమికల్‌పై సుదీర్ఘ పోరాటాన్ని చేపట్టిన రషీద బీ, చంపాదేవి శుక్లాలకు 2004లో 1,25,000 డాలర్ల (సుమారు 50 లక్షల రూపాయల) గోల్డ్‌మాన్ ఎన్విరాన్‌మెంట్ బహుమతి లభించింది.

ఈ డబ్బు మొత్తాన్ని ప్రజాహితానికే ఉపయోగించాలని రషీద బీ, చంపాదేవీలు నిర్ణయించారు. దీంతో చింగారి (నిప్పు రవ్వ) ట్రస్ట్‌ను ఏర్పరిచారు. ఈ డబ్బుతో ప్రధానంగా మూడు కార్యక్రమాలు చేపట్ట తలిచారు: కార్పోరేట్ నేరాలపై పోరాడుతున్న మహిళలకు చింగారి బహుమతి ఇవ్వటం, గ్యాస్ వల్ల ప్రభావితులైన వారికి, అంగ లోపాలలో పుట్టిన వారికి వైద్య సహాయం అందించటం, జీవావరణపరంగా సుస్థిరమైన, సామాజికపరంగా న్యాయ బద్ధమైన జీవనోపాధులను చేపట్టడానికి గ్యాస్ పీడితులకు సహాయం అందించటం.



ముక్తా జోడియా

డిసెంబరు 5, 2007న మొదటి చింగారి బహుమతిని ఒరిస్సాకు చెందిన ముక్తా జోడియాకి ఇవ్వాలని ప్రముఖ రచయిత్రి మహాశ్వేతాదేవి నేతృత్వంలోని బృందం నిర్ణయించింది. ఒరిస్సాలోని కాశీపూర్ ప్రాంతంలో బాక్సైట్ మైనింగ్, ప్రాసెసింగ్ పథకానికి వ్యతిరేకంగా ముక్తా 14 సంవత్సరాలుగా పోరాటం సాగిస్తున్నారు. 45 ఏళ్ళ ముక్తాకి పెళ్ళయిన కొడుకు, కూతురు ఉన్నారు. భర్త లేదా కొడుకుతో సైకిలు మీద ఊరూరు తిరుగుతూ ముక్తా కాశీపూర్ గిరిజనులలో చైతన్యం కలిగించారు. మాతృభూమిని కాపాడుకుందాం, 'పువ్వులం కాదు, అగ్గి రవ్వలం' అన్న నినాదాలతో ఆమె మహిళలను జాగృత పరిచారు. డిసెంబరు 2000లో పోలీసుల కాల్పులలో ముగ్గురు గిరిజనులు చనిపోగా మిగిలిన మహిళలతో కలిసి ముక్తా పోలీసులను ఎదుర్కొని వారి శవాలను దక్కించుకుంది. పట్టు విడవని పోరాటం వల్ల అనేక కంపెనీలు ఈ ప్రాంతాన్ని విడిచి వెళ్ళిపోయాయి. ఆదివాసీల భూములను బడా భూస్వాములు అక్రమంగా స్వాధీనం చేసుకోటానికి వ్యతిరేకంగా కూడా ముక్తా పోరాడుతోంది. మరిన్ని వివరాలకు చూడండి: www.chingaritrust.org

❑

4వ పేజీ తరువాయి . .

ఎక్కడ ఉండాలో వాటి అవసరాలు ఎలా తీరతాయొ, వాటి ఉత్పత్తులను ఎలా ఉపయోగించుకోవాలో నిర్ధారించుకోవాలి. సూర్య రశ్మి, గాలి, నీరు వంటి వనరులను అధ్యయనం చేసి సమర్ధంగా ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. పర్మాకల్చర్ విధానాన్ని మన పరిస్థితులకు అన్వయించుకోవటమెలా అన్న అంశంపై రెండు వారాల శిక్షణను అర్ధేందు ఛటర్జీ నిర్వహిస్తున్నారు. ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలపై అర్ధేందుకి రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. దేశంలోని వివిధ భౌగోళిక పరిస్థితులలోనే కాకుండా జపాన్, ఇతర ఆసియా దేశాలలో పనిచేసిన అనుభవం అర్ధేందుకి ఉంది. అర్ధేందు చక్కటి బోధకుడు.

రెండు వారాల ఈ శిక్షణ ప్రధానంగా ఇంగ్లీషులో సాగుతుంది. శిక్షణార్ధులు ఇంచుమించు 20 మంది దాకా ఉంటారు. వ్యవసాయంతో నేరుగా సంబంధమున్న రైతులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల సిబ్బందికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. శిక్షణా రుసుం 15,000 రూపాయలు. శిక్షణ అనంతపురంలోని టింబక్టు కలెక్టివ్‌లో 2008 ఫిబ్రవరి 8 నుంచి 21 వరకు జరుగుతుంది. పర్మాకల్చర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పేర్లు నమోదు చేసుకోటానికి, ఇతర వివరాలకు సంప్రదించండి: కె. సురేష్ (94408 04860), ఎస్. కిరణ్ (94404 60872).

## 'నీటి' సమాచార వారధి

# ఇండియా వాటర్ పోర్టల్

అమెరికా అంతరిక్ష పరిశోధనా కేంద్రంలో పనిచేసే ఓ యువ భారత శాస్త్రవేత్త మాతృదేశానికి తిరిగివస్తాడు. తన మేధస్సును, పరిజ్ఞానాన్ని గ్రామీణ పేద ప్రజల బతుకుల్లో మార్పు తీసుకు రావడానికి ఉపయోగించాలని నిర్ణయించుకుంటాడు. ఈ మధ్య వచ్చిన 'స్వదేశ్' అన్న హిందీ చిత్రంలో ఇదే ప్రధాన ఇతివృత్తం. అది సినిమాలే కథనే కదా! ఏమైనా జరగొచ్చు అనుకోకండి. సరిగ్గా అలాంటి పనే చేశారు బెంగుళూరుకు చెందిన కొంతమంది యువ ఐ.టి. నిపుణులు. అన్ని హంగులున్న ఆఫీసులు, ఐదారంకెల జీతాలు, ఆధునిక కలల ప్రపంచం ఇవన్నీ వదులుకు న్నారు. మారుమూల ప్రాంతాలలో నివసించే పేదల సమస్యలపై ఆలోచించారు. అన్నింటికన్నా అమూల్యమైన వనరు అయిన నీటిని పొదుపు చేసుకోవాల్సిన అవసరంపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలనుకున్నారు. తమ సాంకేతిక పరిజ్ఞానం అందుకు ఉపయోగించుకున్నారు. అమూల్యమైన నీటికి సంబంధించిన సమస్త సమాచారాన్ని ఒక్కచోట పోగుచేసి ఉంచి, అవసరమైన వారికి సమాచారం అందించే ఓ 'వెబ్ పోర్టల్'ను రూపొందించారు. అదే **'ఇండియా వాటర్ పోర్టల్'**.

ఒక నిర్దిష్ట విషయానికి సంబంధించి సమాచారం అంతా ఒక్కచోట అందించేదే పోర్టల్. కావాల్సిన వారికి సమాచారం అందించడమే కాకుండా తగిన సమాచారం మిగతావారితో పంచుకోవడానికి కూడా ఇది వీలు కల్పిస్తుంది. నీరు, నీటి సంఘాలు, సంబంధిత విధానాలు, అనుభవాలకు సంబంధించిన సమాచారమంతా ఒకచోట లభ్యమయ్యే ఈ తరహా పోర్టల్‌లో ఇదే మొదటిది. నీటి రంగానికి సంబంధించిన సమాచార వ్యవస్థలో ఇదొక ఓపెన్ ప్లాట్‌ఫారం. నీటి యాజమాన్యం, పొదుపు అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు అపోహలను తొలగించడం, ఆ దిశలో విజయవంతమైన పద్ధతులు, అనుభవాలను అందరికీ తెలిసేలా చేయడం, ఆయా భాగస్వామ్యుల మధ్య సంబంధిత సమాచార పంపిణీకి వేదికగా పనిచేయడం తమ లక్ష్యాలని పోర్టల్ నిర్వాహకులు చెబుతున్నారు. "…. నీటి రంగంలో సంక్షోభం అందరికీ తెలిసిన నిజం. మా పోర్టల్‌లో దానికి సంబంధించి రకరకాల సమాచారం అందుబాటులో ఉంది. వాన నీటి సంరక్షణ కోసం మీ ఇంటికి కానీ, ఆఫీసుకు కానీ ఎలాంటి పద్ధతులు, ఏర్పాట్లు చేసుకోవచ్చో సులభంగా వివరించే స్లైడ్స్ ప్రదర్శనలు ఉన్నాయి. దేశ వ్యాప్తంగా విజయవంతమైన అనుభవాల సమాచారం ఉంది. పార్లమెంట్‌లో ప్రజా ప్రతినిధులు నీటి రంగానికి సంబంధించి చర్చించే విషయాలు ఉన్నాయి… " అని వారంటున్నారు. మామూలు ప్రజానీకంతో పాటు విధాన నిర్ణేతలు, స్వచ్ఛంద సంస్థలు, పరిశోధకులకు పనికి వచ్చే సమాచారం పోర్టల్‌లో ఉంది. నీటికి సంబంధించి తమ పరిజ్ఞానం పరీక్షించు కోవడానికి ఉన్న పజిల్స్, క్విజ్‌లు ఒక ఆకర్షణ అయితే ఆటలు ఆడుతూ, పోటీ పడుతూ చిన్న పిల్లలు కొత్త కొత్త విషయాలు తెలుసుకోవడానికి వీలు కల్పించే 'కిడ్స్ సెక్షన్' ఇంకో ఆకర్షణ. ఇక సీరియస్ సమాచారం విషయానికి వస్తే నీటి ప్రణాళికలు, పరిశోధనలకు పనికొచ్చే గణాంకాలు, విధానాలు, చట్టాలు, వాటర్ బడ్జెటింగ్‌కు తోడ్పడే వీడియో ట్యుటోరియల్స్, స్వచ్ఛంద సంస్థల సమాచారం, క్షేత్రస్థాయి అనుభవాలు వంటి విలువైన సమాచారం పోర్టల్‌లో పొందుపర్చారు. నీటికి సంబంధించి ఈ పోర్టల్ ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య సమాచార వారధిగా పనిచేస్తుంది. ఇన్ఫోసిస్ సంస్థ సి.ఇ.ఓగా పనిచేసిన నందన్ నీలకేణి భార్య రోహిణి నీలకేణి ప్రారంభించిన 'అర్ఘ్యం' అనే స్వచ్ఛంద సంస్థ ఈ పోర్టల్ నిర్వహిస్తోంది. కొత్త కొత్త మాధ్యమాల ద్వారా ప్రజలకు సమాచారం అందించడానికి పోర్టల్ వినూత్న ప్రయోగాలు చేస్తోంది. తాజాగా బెంగుళూరు, చిత్రదుర్గ, తుంకూరు ప్రాంతాల ప్రజలకు రేడియో కార్యక్రమాలు కూడా అందిస్తోంది. (వివరాలకు www.indiawaterportal.org) ❑



# 'శ్రీ' వరికి 'సుక్షేత్రం' లాగే వీడర్

విత్తన రకం, ఉత్పాదకాల మోతాదుతో సంబంధం లేకుండా దిగుబడులను పెంచటానికి అవకాశమున్న పద్ధతిగా 'శ్రీ' సాగు వరిలో మన ముందుకు వచ్చింది. శ్రీ పద్ధతిలో తక్కువ నీళ్ళు, తక్కువ ఉత్పాదకాలు అవసరమవుతాయి. అయితే కలుపును నేలలోకి దానిని కూడా వనరుగా ఉపయోగించుకోవటంలో కొన్ని సమస్యలు ఉన్నాయి. మలేసియాలో తయారు చేసిన వీడర్ ఆధారంగా ఆం.ప్ర. వ్యవసాయ విద్యాలయం 'కోనో వీడర్'ను తయారు చేసి రాష్ట్రమంతటా అందించింది. వ్యవసాయ శాఖ ఇచ్చిన / ఇస్తున్న సబ్సిడీ వల్ల కూడా ఇది ఎక్కువగా వ్యాప్తి చెందింది.

అప్పటికీ అందుబాటులో ఉన్న వీడర్లు, వాటి బలాలు, బలహీనతలను వర్కుషాపులో నాలుగేళ్ళ క్రితం పరిశీలించారు. వీడర్ నడపటంలో సమస్యలు, వీడర్‌లో ఉండవలసిన అంశాల గురించి కూడా చర్చించారు. రకరకాల వీడర్లలోని బలాలను ఏర్చి కూర్చి కిషన్ రావు ఒక కొత్త వీడర్‌కి రూపకల్పన చేశారు. దీనికి 'మండవ' వీడర్ అని పేరు పెట్టారు. అన్ని పరిస్థితులకు, అన్ని అవసరాలకు ఒకే వీడర్ అని కాకుండా రకరాల వీడర్లు అందుబాటులో ఉండేలా చూడటం ముఖ్యమన్న ఏకాభిప్రాయానికి వచ్చారు.

మండవ వీడర్‌ని పొలంలో ఉపయోగిస్తున్న క్రమంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు దానిలో సవరణలను కిషన్ చేయిస్తూనే ఉన్నారు. రెండు వరసల మండవ వీడర్‌ని కూడా ఇదే క్రమంలో తయారు చేశారు. బరువు తగ్గటం, నడిపే వారికి ఇబ్బందిగా ఉండకపోవటం అన్ని అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

ఈ క్రమంలో కోనో వీడర్, మండవ వీడర్ మాదిరి తోసేది కాకుండా సాంప్రదాయంగా ఉపయోగిస్తున్న లాగే వీడర్ కిషన్ దృష్టికి వచ్చింది. దీనిని శ్రీ పద్ధతికి అనుగుణంగా మార్చుకున్నారు.



ఇలా రూపొందించిన వీడర్‌కి 'సుక్షేత్రం వీడర్' అని పేరు పెట్టారు.

తోసే వీడర్‌లో వత్తిడి ముందుకి, కిందకి ఉంటుంది కాబట్టి దానిని నడిపే వారిపై భారం పడటమే కాకుండా అది మాగాణి నేలల్లో 'దిగబడిపోయే' సమస్య కూడా ఎక్కువ. అదే లాగుడు వీడర్‌లో వత్తిడి ముందుకి, పైకి ఉంటుంది. దీనివల్ల నడిపే వారిపై ఎటువంటి భారమూ ఉండదు, నేలలో దిగుబడే సమస్యా ఉండదు.

మూడు వరసల వీడర్‌ని రాయిచూర్ కృష్ణారావు గతంలో తయారు చేయించారు. అయితే దీనిని నడపటానికి ఇద్దరు వ్యక్తులు కావాలి. ఒకరు ముందు నుంచి లాగుతుంటే ఇంకొకరు వెనక నుంచి సరిగా నడిపిస్తుంటారు. సుక్షేత్రం వీడర్‌లో ఒక వ్యక్తే సరిపోతారు. ఈ పద్ధతిలో తేలికపాటి ఇసక నేలలో 2-3 వరసల సుక్షేత్రం వీడర్‌ని ఒకే వ్యక్తి తేలిక నడపగలుగుతాడు. అదే మాగాణి, బురదనేలల్లో ఒకే వరస వీడర్‌కి పరిమితం కావలసి ఉంటుంది. సుక్షేత్రం వీడర్‌ని క్షేత్రంలో ఉపయోగించి మంచి ఫలితాలు పొందారు. ఇంకా కొంత క్షేత్ర పరిశోధన జరిగిన తరువాత దీని డిజైన్‌కు తుది రూపం ఇస్తారు. మరిన్ని వివరాలకు కిషన్‌రావుని సంప్రదించండి (మొబైల్: 9441123197). ❑

Book Post

**వాసన్**

12-13-450, వీధి నెంబరు 1, తార్నాక

సికింద్రాబాదు - 500017

ఫోన్: 040-27015295/27015296

Email: wassan@eth.net, Website: www.wassan.org

Aide à l'Enfance de l'Inde Supported by AEI, Luxembourg

To

for private circulation only